జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 03-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 717 పేజీలు: 4 వెల : రూ.7

## క్రీడలు, శిక్షణకు వేదికగా..

# పోలీస్ క్రీడా మైదానం

* పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి * అప్పుడే ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవచ్చు * ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారి సమస్యలు ఓర్పుగా వినాలి * విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ * అత్యాధునికి మైదానంగా తీర్చిదిద్దాం * జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి * జిల్లాలోని పలు పీఎస్‌ల తనిఖీ * పర్యాటక ప్రాంతాల పరిశీలన * పైడిభీమవరంలో సిస్కో పీఎస్ ప్రారంభం

శ్రీకాకుళం, జులై 2 (వార్త): శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఆర్డ్ రిజర్వ్ పోలీసు మైదానం పునరుద్ధరణ అనంతరం గురువారం జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ముఖ్య అతిథిగా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు మైదానం, సంకల్ప వేదిక, క్రికెట్ గ్రౌండ్, విక్టరీ గ్యాలరీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పోలీసు సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను తిలకించారు. అనంతరం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఈ పోలీసు మైదానం కేవలం క్రికెట్ ఆడేందుకు మాత్రమే కాకుండా పరేడ్‌లు, శారీరక శిక్షణ, వివిధ క్రీడా పోటీలు, అధికారిక కార్యక్రమాలు, పోలీసు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువైన బహుళ ప్రయోజనాల వేదికగా తీర్చిదిద్దారన్నారు. పరేడ్‌లు, క్రీడలు, శారీరక శిక్షణ కార్యక్రమాల్లో ఆర్డ్ రిజర్వ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. సమీపంలో ఉన్న డీటీసీ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న పోలీసు సిబ్బందికి సంబంధించిన అనేక కార్యక్రమాలను కూడా ఈ మైదానంలో నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ వసతిని పోలీసు సిబ్బంది తమ శారీరక సామర్థ్యం, వృత్తి నైపుణ్యాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్న ఐజీ, ప్రజాసేవ అంటే ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, సమయపాలనతో నిర్వహించడమేనని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను ఓర్పుగా విని, చట్టప్రకారం సకాలంలో పరిష్కరిస్తే పోలీసులపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. ఉద్యోగంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పెంపొందించుకోవాలన్నార. శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, సేవాభావంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు, ఆర్డ్ రిజర్వ్ సిబ్బంది, సహకరించిన ప్రతి ఒక్కరికి ఐజీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది పోలీస్ కానిస్టేబుల్ నియామకాల సందర్భంగా ఆర్డ్ రిజర్వ్ పోలీసు మైదానాన్ని ఆధునీకరించాలని సంకల్పించి అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా దశలవారీగా చేపట్టిన పనుల ఫలితంగా నేడు ఈ మైదానం అత్యాధునిక క్రీడా వేదికగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. ఈ మైదానం కేవలం పరేడ్‌లు, క్రికెట్‌కే పరిమితం కాకుండా రానున్న రోజుల్లో బ్యాడ్మింటన్ కోర్టులు, ఇతర క్రీడలకు అవసరమైన మౌలిక వసతులు, ఫిట్‌నెస్ సదుపాయాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి క్రీడా సముదాయంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది, వారి






కుటుంబ సభ్యులు ప్రతిరోజూ వ్యాయామం, వాకింగ్, శారీరక దారుఢ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు సోలార్ లైటింగ్‌తో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే ఈ వేదికను పోలీసు కుటుంబాల సంక్షేమానికి ఉపయోగపడే 'సంకల్ప' సంక్షేమ వేదికగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఈ మైదానం అభివృద్ధికి జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా హోంగార్డుల నుంచి అదనపు ఎస్పీ స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయడం వల్లే అతి తక్కువ సమయంలో ఈ అత్యాధునిక క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయగలిగామని, ఈ విజయం జిల్లా పోలీసు కుటుంబం మొత్తం కృషికి నిదర్శనమని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, అత్యాధునిక సౌకర్యాలు, మౌలిక వసతులతో పోలీసు మైదానాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఈ మైదానాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది క్రీడలు, వ్యాయామం, ఫిట్‌నెస్ కార్యక్రమాలకు విస్తృతంగా వినియోగించుకొని వ్యక్తిగత ఆరోగ్యం, శారీరక దారుఢ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పచ్చదనానికి ప్రతీకగా రేంజ్ ఐజి, జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ, డీఎస్పీలు సి.హెచ్. వివేకానంద, లక్ష్మణరావు, టి. భవానీ శేషాద్రి, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పైడిభీమవరంలో సిస్కో పోలీసు స్టేషన్ ప్రారంభం

నేర నియంత్రణ,అత్యవసర సంఘటనలపై సిస్కో పోలీసు స్టేషన్ ద్వారా తక్షణ స్పందన లభిస్తుందని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి పేర్కొన్నారు. రణస్థలం మండలం, పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో డా.రెడ్డీస్ ల్యాబ్రేట్రిస్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిస్కో పోలీసు స్టేషన్‌ను గురువారం విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రేంజ్ ఐజీ మాట్లాడుతూ, సిస్కో పోలీసు స్టేషన్ ద్వారా పారిశ్రామిక ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్ఠమవుతుందని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నేర నియంత్రణ, అత్యవసర సంఘటనలపై తక్షణ స్పందన, పరిశ్రమల భద్రతకు సంబంధించిన అంశాలపై నిరంతర పర్యవేక్షణ, పోలీసు సంబంధిత శాఖలతో సమన్వయం మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ పోలీస్ స్టేషన్ పరిశ్రమలు, కార్మికులు, ప్రజలకు మరింత భద్రతాయుత వాతావరణాన్ని కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతం రణస్థలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా, సిస్కో పోలీసు స్టేషన్ ఏర్పాటు ద్వారా పోలీసు సేవలు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందుబాటులోకి రానున్నాయని ఐజీ తెలిపారు. సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో అవసరమైన పోలీసు సిబ్బందిని నియమిస్తున్నట్లు, ఆయా సిబ్బంది నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో ఈ విధమైన పోలీసు స్టేషన్ ఏర్పాటు అవసరం ఉందని అని ఆయన స్పష్టం చేశారు. సిస్కో పోలీసు స్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిన జిల్లా ఎస్పీని అభినందించి, సహకరించిన పారిశ్రామిక సంస్థల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ, రణస్థలం పైడిభీమవరం మధ్య దూర ప్రాంతం ఎక్కువ కావడంతో పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల వేగవంతమైన స్పందనతో పాటు పరిశ్రమలు, పోలీసుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ సిస్కో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఈ పోలీస్ స్టేషన్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, డా.రెడ్డీస్ ల్యాబరేటరీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డా.వి.నారాయణ రెడ్డి, సీఐ ఎం.అవతారం, ఎస్సై చిరంజీవితో పాటు పోలీసు అధికారులు, వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్యం, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### నేర నియంత్రణలో సాంకేతికత వినియోగం పెరగాలి

వార్షిక తనిఖీలలో భాగంగా విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి శ్రీకాకుళం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి. మహేశ్వర రెడ్డితో కలిసి శ్రీకాకుళం రూరల్, ఆముదాలవలస, గార పోలీస్ స్టేషన్‌లను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్‌లలో నిర్వహిస్తున్న జనరల్ డైరీలు, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, స్టేషన్ రికార్డులు, మాల్ఖానా నిర్వహణ, ఆయుధాల భద్రత, స్టేషన్ పరిశుభ్రత, డిజిటల్ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, నేరాల దర్యాప్తు తీరు, మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన కేసుల విచారణ, సీసీటీఎన్ఎస్ నమోదులు తదితర అంశాలను ఐజీ గారు క్షుణ్ణంగా పరిశీలించారు.అలాగే పోలీస్ స్టేషన్‌లలో ప్రజలకు అందిస్తున్న సేవలు, ఫిర్యాదుల స్వీకరణ విధానం, ఫిర్యాదులపై స్పందన తీరు, బాధితులకు అందిస్తున్న సహాయం, పోలీసు సిబ్బంది పనితీరు, క్రమశిక్షణ, స్టేషన్ నిర్వహణ ప్రమాణాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఐజీ మాట్లాడుతూ, ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖపై వారి విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా సేవలు అందించాలని తెలిపారు. నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, రికార్డుల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా పోలీస్ స్టేషన్‌ల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు, నేర నియంత్రణ, దర్యాప్తు నాణ్యత, ప్రజా సేవల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.ఈ తనిఖీలలో టౌన్ డీఎస్పీ వివేకానంద సంబంధించిన పోలీసు అధికారులు పాల్గొనారు.





## రోడ్డు బాగుచేసి..

# ర్యాంపు నిర్వహించుకోండి

* బుచ్చిపేట గ్రామస్థుల డిమాండ్ * చేనులువలస ఇసుక ర్యాంపుతో భూగర్భజలాలు తగ్గుముఖం * అక్రమ ఇసుక డంపింగ్, భూగర్భ జలాలపై విచారణ కోరుతూ ఆందోళన

నరసన్నపేట, జూలై 2 (వార్త): చేనులువలస ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తరలింపు వల్ల తమ గ్రామ రహదారి అధ్వానంగా మారింది.. భూగర్భ జలాలు తగ్గిపోయాయి. తమ పంటలకు నష్టం కలుగుతోంది.. అంటూ బుచ్చిపేట గ్రామస్థులు ఆందోళనకు దిగారు. చేనులువలస ఇసుక ర్యాంపునకు వాహనాలు వెళ్లకుండా అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా గ్రామ రహదారులను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసిన తర్వాతే ఇసుక ర్యాంపును తిరిగి ప్రారంభించుకోవాలని డిమాండ్ చేశారు. చేనులువలస ఇసుక ర్యాంపు నుంచి తవ్విన ఇసుకను మడపాం ప్రాంతంలో అక్రమంగా డంప్ చేసి, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. భారీ లారీలు, ట్రాక్టర్ల రాకపోకల కారణంగా గ్రామంలోని రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఇసుక వాహనాలను అడ్డుకోవాల్సివచ్చిందన్నారు. ఇక బుచ్చిపేట పరిసర ప్రాంతాల్లోని జీడితోటలకు సాగునీటి సమస్య తీవ్రంగా మారిందని రైతులు తెలిపారు. ఇసుక ర్యాంపులో 20 నుంచి 30 అడుగుల లోతు వరకు తవ్వకాలు నిర్వహించడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయి జీడితోటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు.

## శ్రీకాకుళం

## బీజేపీ నాయకుడు సురేష్‌కు పితృ వియోగం



**మందస, జులై 1(వార్త):** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, సమాజ సేవకుడు కొంచాడ సురేష్‌కుమార్‌కు పితృవియోగం కలిగింది. సురేష్ కుమార్ తండ్రి మోహనరావు(68) ఆకస్మికంగా మరణించారు. భోజనం చేస్తుండగా.. హటాత్తుగా పడిపోయారు. అనంతరం మరణించారు. మోహన రావుకు భార్య శారద, కుమారులు సురేష్ కుమార్, ఈశ్వరరావు ఉన్నారు. సురేష్‌కుమార్ కుటుంబానికి మంచి పేరుండడంతో మోహనరావు అంత్యక్రియల్లో పలువురు నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సురేష్ కుమార్ కూడా ఈ ప్రాంతంలో బీజేపీ బలోపేతం కావడంతో ఎంతో కృషి చేశారు. దీంతో సురేష్ కుమార్ కు కూడా సంఘ సేవకునిగా.. హరిపురం గ్రామ పెద్దగా.. భారతీయ జనతా పార్టీ నేతగా మంచి పేరు ఉండడంతో ఆయన తండ్రి మోహనరావు మరణించడంతో నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సురేష్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. సంతాపం తెలిపారు. మోహనరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. మోహనరావు మరణంతో హరిపురంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## తేలుకుంచిలో ఉపాధి పనులు ప్రారంభం




**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** కేంద్ర ప్రభుత్వం కొత్తగా పేరు మార్చిన విబిజి రాంజీ ఉపాధిహామీ పథకం తేలుకుంచి గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లోపింటి పద్మనాభం, మెరుగు నారాయణ మెరుగు సీత,దక్కత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ విజయోత్సవం



**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** రోటరీ క్లబ్ చేసిన సేవలను కమ్యూనిటీ సర్వీసు ఒకేషనల్ సర్వీసు పబ్లిక్ ఇమేజ్ ఎన్విరాన్మెంట్ పోలియో హెల్త్ క్యాంప్స్ స్టూడెంట్ గేమ్స్ వగైరా సేవలకు గాను ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్ వెంకటేష్ సెక్రటరీ కె రామకోటి సేవలను గుర్తించి ఇటీవలి జరిగిన అవార్డ్స్ రేట్స్ వేడుకల్లో డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి , ప్రెసిడెంట్, సెక్రటరీ లను గుర్తించి ఐదు గోల్డెన్ అవార్డ్స్, ఐదు సిల్వర్ అవార్డ్స్ ఇచాపురం క్లబ్ కి అందజేశారు. కొత్త ప్రెసిడెంట్ డాక్టర్ వేదవ్యాస్ సెక్రటరీగా నవీన్ చౌదరి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం జరిగింది.

## డాక్టర్స్ డే వేడుకలు



**ఇచ్ఛాపురం, జులై 2(వార్త):** డాక్టర్స్ డే సందర్భంగా రోటరీ క్లబ్ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో డాక్టర్ డి.త్రినాథరెడ్డి, రొటేరియన్ డాక్టర్ వేదవ్యాస్, డాక్టర్ మోహన్ వెంకటేష్, డాక్టర్ శేషు, డాక్టర్ సురేష్‌రెడ్డిలను శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం డాక్టర్స్ మాట్లాడుతూ తాము డాక్టర్ వృత్తితో పాటు రోటరీ క్లబ్ ద్వారా సేవలను అందజేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ వేదవ్యాస్, సెక్రటరీ నవీన్ చౌదరి, శ్రీకాకుళం జిల్లా పబ్లిక్ ఇమేజ్ రీజనల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్స్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్‌గా

# పైడి ప్రవీణ ఎంపిక

**- పాఠశాలల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తానని వెల్లడి**

**పోలాకి, జూలై2 (వార్త):** ఈదులవలస ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ జిల్లా ఏపీ మోడల్ స్కూల్స్ కోఆర్డినేటర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని మోడల్ పాఠశాలల ప్రిన్సిపల్స్‌తో సమన్వయం చేసుకుంటూ విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని పైడి ప్రవీణ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈదులవలస మోడల్ పాఠశాలలో జిల్లా మోడల్ పాఠశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం ఆమెను ఘనంగా అభినందించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ, పైడి ప్రవీణ విద్యా రంగంలో చూపుతున్న అంకితభావం, పరిపాలనా నైపుణ్యం ఆమెకు ఈ బాధ్యతలు దక్కడానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మోడల్ పాఠశాలల అభివృద్ధికి ఆమె సేవలు మరింత ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# వీబీజీ రామ్‌జీతో ఉపాధి పనులకు మేలు

**-ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**-పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.**



**మందస, జులై 2(వార్త):** వికసిత్ భారత్‌జీ -రామ్‌జీ పథకంతో ఉపాధి పనులకు మేలు జరుగుతుందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని కుసుమల పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, శిరీషా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలనే లక్ష్యంతో వికసిత్ భారత్--జీ రామ్ జీ అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, కూలీల సంక్షేమానికి, ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పెంపునకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రజలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రభుత్వ సేవలను వేగవంతంగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వికసిత్ భారత్ -- జీ రామ్ జీ" కార్యక్రమం ద్వారా 125 రోజుల ఉపాధి హామీ పనుల ప్రణాళిక రూపొందించడం జరుగుతోందన్నారు.



గ్రామసభల ద్వారా గ్రామ పంచాయతీ ప్రణాళిక (జీపీపీ) రూపొందించడం, శ్రమశక్తి ఆధారిత సహజ వనరుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించడం, గ్రామ పంచాయతీల ప్రణాళికల్లో అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించడం జరుగుతుందన్నారు. నిర్దిష్ట సమయాల్లో పనులు పూర్తి చేసి ఆస్తుల సృష్టికి ప్రాధాన్యం ఇవ్వడం. సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన అమలు, పారదర్శకత పెంపొందించడం వంటి ముఖ్య లక్ష్యాలు అమలు చేయబడుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఎన్నో కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తూ గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. పలాస నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరేలా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కట్టుబడి పనిచేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, స్థానిక గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ పేరుతో ఉపాధి హామీకి తూట్లు

**- గునపానికి, పారకి, తట్టెకి డబ్బులేవి ?**

**- పేరు మార్చినా హక్కులు కల్పించాలి**

**- ఏఐకేయంఎస్ డిమాండ్**




**పలాస, జులై 2(వార్త):** సంపూర్ణంగా అమలుచేస్తూ చట్టం చేసిన విబిజీరామ్జీ ఉఫాధీ చట్టాన్ని సరళం చేసి పసలేని చట్టంగా తయారు చేసిన ఘనత మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదేనని, మనకి గతంలో ఉన్న మహాత్మగాంది ఉపాది హామీ చట్టానికి,, ఈరోజు ప్రారంబించిన విబిజీరామ్జీ ఉపాది హామీ చట్టాని నక్కకి నాగలోకానికి ఉన్నంత వ్యత్యాసం ఉందని అఖిల బారత కిసాన్ సభ రైతు సంఘం (ఎఐకేయం) జిల్లా కన్వినర్ మద్దిల రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గత చట్టంలో ఉన్న హక్కులన్ని కాలరాస్తూ, మెల్ల మెల్లగా ఈ చట్టానికి తూట్లు పొడిచి ఎత్తి వేసే కార్యక్రమానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు. ఉపాధీ కార్మికులు, మీరు చేసే పనుల్లో గల మంచి చెడ్డలు మీరు చూడాలని కోరారు. ఎందుకంటే ఇప్పటికే ఈ దేశంలో గల 18 రాష్ట్రాలు కేంద్రానికి మొర పెట్టుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. గతంలో మహాత్మగాందీ పదకంలో, రాష్ట్ర వాటా 10%,, కేంద్రం వాటా 90% గా ఉండేదని తెలిపారు. ఈరోజు దాన్ని ఈవిదంగా మార్చి రాష్ట్రాల మీద బారాలు మోపుతున్నారు. ఇప్పుడు అమలుచేస్తున్న విబిజీరామ్జీ పదకంలో రాష్ట్ర వాటా 40%,,కేంద్రం వాటా60%, వాటాలుగా పెట్టుబడులు పెట్టాలని కేంద్రం తేల్చి చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడంలో వీళ్ళ వైఖిరి తేటతెల్ల మయందని తెలిపారు. ప్రజలు, ఉపాధి కార్మికులు వీటిని గుర్తించి డిమాండ్ చేయాలని కోరారు. ఇలా 40% పెట్టుబడులు పెట్టే పరిస్తితితులో రాష్ట్రాలు ఉన్నాయా? అని ఆవేదన వ్యక్తం చేసారు. మనకు తెలుసు గత ఉపాదీ ఫదకంలో అనేక సౌకర్యాలు కార్మికులు ఉండేవని, వారు పనిచేసిన ప్రతి పని ముట్లుకు రేటు ఉండేదని, పార, గునపాలు, మట్టి మోసే తట్టెలకు రేట్లు ఉండేవని, ఎండల్లో పనులు చేస్తే మజ్జిగ, టెంట్ లు, మంచి నీరు తెచ్చేందుకు ఒక ఉపాది హామి కార్మికులకు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. మందులు సప్లై లతో సహా ఏమైన పనులు చేసే టప్పుడు ఇబ్బందులు జరిగితే కాలు, చేయి విరిగితే డబ్బులు ఇన్సూరెన్స్, ఎన్నిరోజులు పనిలోకి రాలేక పోతే అన్నిరోజులు మస్తర్ వేసేవారని తెలిపారు. చనిపోతే 2 నుంచి 5 లక్షలు వరకు ఇన్సూరెన్స్ కవరింగ్ ఉండేదని, ఇవన్నీ ఇప్పుడు గాల్లోకి కలిసిపోయాయని తెలియజేసారు. మీ హక్కులు కాపాడుకోవాలని తెలిపారు. ఈహక్కులన్ని వికసిత్ బారత్ విబిజిబి రామ్జీ ఉపాదీ చట్టంలో చేర్చాలని రామారావు డిమాండ్ చేసారు.

# ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

**- పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- మాతా-శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి ఆదేశం**

**పోలాకి, జులై 2(వార్త):** పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాతా--శిశు మరణాలు జరగకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోగులతో సానుభూతితో వ్యవహరిస్తూ సేవాభావంతో విధులు నిర్వహించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపరచాలని అన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది ఆసుపత్రిలో ఉన్న మౌలిక వసతుల కొరత, సిబ్బంది అవసరం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సూరపు నారాయణదాసు, లుకలాపు చిన్నబాబు, తెంబూరు గౌరినాయుడు, భైరి అచ్చెన్నాయుడు, తహసీల్దార్, ఎంపీడీవో, వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## వంగపండును స్మరించుకుందాం రండి

**ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక అధ్యక్షుడు అమ్మ రామకృష్ణ పిలుపు**

**-పలాసలో కరపత్రం ఆవిష్కరణ**



**పలాస, జులై 2(వార్త):** ప్రజా గాయకుడు, వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు 7వ వర్ధంతి సందర్భంగా ఆగస్టు 4న నిర్వహించే స్మారక సభను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక అధ్యక్షులు అమ్మ రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పలాసలో వివిధ ప్రజా, సాంస్కృతిక, జానపద సంస్థల నాయకులతో కలిసి వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మ రామకృష్ణ మాట్లాడుతూ వంగపండు ప్రసాదరావు ఉత్తరాంధ్ర జానపద కళలకు, ప్రజా సాంస్కృతిక ఉద్యమాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. వర్ధంతి కార్యక్రమంలో వివిధ జానపద కళారూపాల ప్రదర్శనలు, గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వంగపండు జీవిత విశేషాలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాకారులు, ప్రజా సంఘాలు, సాంస్కృతిక వేదికలు, జానపద కళాబృందాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కార్మికుల శ్రమ నుంచి పుట్టిన జానపద కళలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నేటి తరానికి ఉత్తరాంధ్ర జానపద సంపదను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జానపద కళలను అసభ్యకరంగా మార్చే ధోరణిని ఖండిస్తూ, వంగపండు ఆశయాలను కొనసాగించే దిశగా అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక కార్యదర్శి బంధాపు తిరుమలరావు, కొర్రాయి నీలకంఠం (ప్రజా కళామండలి), తామాడ సన్యాసిరావు (జన సాంస్కృతిక మండలి), సిస్టు మనోజ్ (గిడుగు రామమూర్తి జానపద కళాపీఠం), కోరాడ లింగమూర్తి (ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక), కుర్రాయి శ్రీకాంత్ (రంగం వేదిక), రాపాక చిన్నరావు, మద్దిల రామారావు, కుత్తుం వినోద్, శ్రీధర్ పోతనపల్లి, భాస్కరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కూటమి ప్రభుత్వం

**- ఒకే ఇంటికి రెండు పెన్షన్ల మంజూరు**

**- అక్కుపల్లిలో నిరుపేద కుటుంబానికి కొండంత అండ**

**- కిడ్నీ బాధితురాలికి పెన్షన్ అందజేత**

**- సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు**

**జీవితాంతం రుణపడి ఉంటాం : బాధితులు**

**పలాస, జులై 2(వార్త):** అక్కుపల్లి (ఉద్దానం) పేదల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న రాష్ట్ర కూటమి ప్రభుత్వం, శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో మానవత్వాన్ని చాటుకుంది. మండల పరిధిలోని అక్కుపల్లి గ్రామానికి చెందిన ఒకే నిరుపేద కుటుంబానికి రెండు పెన్షన్లను మంజూరు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామానికి చెందిన కాస కల్యాణేశ్వర రావు అనే నిరుపేదకు గతంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెన్షన్ మంజూరు చేశారు. ప్రస్తుతం ఆయన సతీమణి కాస సుజాత తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, సుజాతకి కూడా కిడ్నీ బాధితుల ప్రత్యేక పెన్షన్‌ను తక్షణమే మంజూరు చేశారు. నూతనంగా మంజూరైన పెన్షన్ పైకాన్ని వజ్రపుకొత్తూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు గురువారం లబ్ధిదారుల నివాసానికి స్వయంగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందబాష్పాలు రాల్చుతూ.. "మా కష్టాలు చూసి ఒకే ఇంటికి రెండు పెన్షన్లు ఇచ్చి ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, నిరంతరం మాకు అండగా నిలుస్తున్న పలాస శాసనసభ్యులు గౌతు శిరీషకి, స్థానిక నాయకులకు, అధికారులకు మేము జీవితాంతం రుణపడి ఉంటాం" అని చెప్పుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మండల మాజీ ఎంపీపీ ప్రతినిధి, టీడీపీ మండలాధ్యక్షులు సూరాడ మోహనరావుతో పాటు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సీమ దేవస్వామి, అధికార పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సూరాడ లోకనాథం, గ్రామ సంఘం అధ్యక్షులు మోస వరప్రసాద రావు, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

- కలిసికట్టుగా సైనికుల్లా పని చేయాలి
- బూత్ లెవెల్‌లో సమస్యలు పరిష్కరించాలి
- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



**మందస, జులై 2(వార్త):** ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలని, ఇప్పటి నుంచే పోరాటానికి సిద్ధం కావాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. మందస పట్టణంలోని శ్రీవాసుదేవస్వామి ఆలయం సమీపంలో జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో అప్పలరాజు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. సర్ కార్యక్రమంలో ఎలా పాల్గొనాలి.. ఎలా సమస్యలు పరిష్కరించుకోవాలో దిశా నిర్దేశం చేశారు. అనంతరం ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లోకి వచ్చే కూటమి అభ్యర్థులు ముందుగా 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు లెక్క చెప్పాలని, ఆ తర్వాతే ఓట్లు అడగాలని వైయస్సార్సీపి శ్రీకాకుళం జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ డిమాండ్ చేశారు. మందస మండలంలోని హరిపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ కలిసి రాష్ట్రవ్యాప్తంగా హామీల వర్షం కురిపించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిందని, ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. ఇప్పుడు స్థానిక ఎన్నికలు వస్తున్నాయని మళ్లీ ఊళ్లలోకి వస్తున్నారని, ముందు పాత బాకీ తీర్చండని మడియ రామకృష్ణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వాన్ని ఆయన 12 ప్రధాన అంశాలపై నిలదీశారు. యువతకు నెలకు 3 వేల నిరుద్యోగ భృతి, 60 ఏళ్లు నిండిన వారందరికీ పెన్షన్, 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెన్షన్, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 ఆడబిడ్డ నిధి, పూర్టు రిచ్ పథకం, పేదలకు 3 సెంట్ల స్థలంలో ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, వితంతు పెన్షన్ పెంపు, ఇంటింటికీ తాగునీటి కుళాయి, జర్నలిస్టులకు 10 లక్షల ఉచిత ఇన్సూరెన్స్, ప్రతి కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా, సహజ మరణానికి 5 లక్షలు, ప్రమాద మరణానికి 10 లక్షల బీమా హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, సీనియర్ నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, మండల యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, పార్టీ నాయకులు చింతాడ గణపతి, మడియా రామక్రిష్ణ, సిందిరి జగన్, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, బత్తిన లక్ష్మణ్, దున్న హరిక్రిష్ణ, సవర నీలకంఠం, పులారి పితాంబరం, నాగేశ్వర బృందావన్, తలగాన హరిక్రృష్ణ పాల్గొన్నారు.



## గ్రామీణాభివృద్ధికి కొత్త దిక్సూచి..

# వికసిత్ భారత్‌జీ ..రామ్‌జీ

- పలాసలో శ్రీకారం
- ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత
- సాంకేతికతతో వేగం
- ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు 125 రోజుల పాటు ఘనంగా నిర్వహణ
- గ్రామాల రూపురేఖలు మారుస్తాం
- ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, జులై 2(వార్త):** గ్రామసభల నుంచే అభివృద్ధి ప్రణాళికలు గ్రామీణాభివృద్ధికి మరింత వేగం, హామీ పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "వి.వి.కసిత్ భారత్-జీ రామ్‌జీ" పలాస మండలం తర్లకోట గ్రామాల్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరింత సమర్థవంతంగా అమలు చేయడం, కూలీలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా ప్రజలకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

### 'వికసిత్ భారత్-జీ రామ్ జీ' ప్రధాన లక్ష్యాలు:

గ్రామాల అవసరాలకు అనుగుణంగా 125 రోజుల ఉపాధి హామీ కార్యాచరణ రూపొందించడం. గ్రామసభల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) సిద్ధం చేయడం.

సహజ వనరుల పరిరక్షణ, శ్రమ ఆధారిత అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత కల్పించడం. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి శాశ్వత ఆస్తుల సృష్టిని వేగవంతం చేయడం. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పనుల నాణ్యత, పారదర్శకత పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తూ గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణకు కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.

పలాస నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధి ఫలాలు ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి విజయవంతం చేసేందుకు తాము నిరంతరం కృషి చేసి ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విఠల్, ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లింగాలవలసలో వీబీజీ-రామ్‌జీ ప్రారంభం

- ఉపాధి హామీ పనిదినాలు 125 రోజులకు పెంపు
- అధికారుల వెల్లడి
- నీటి భద్రత, జీవనోపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం

**జలుమూరు, జులై 2(వార్త):** లింగాలవలస గ్రామంలోని మర్రిబంద వద్ద వీబీజీ-రామ్‌జీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ బి. చిన్నమ్మడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో కార్మికులకు ప్రస్తుతం ఉన్న 100 రోజుల పనిదినాలను 125 రోజులకు పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ పనులు జరిగే సమయంలో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులకు విరామం ఇవ్వనున్నట్లు వివరించారు. పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తాయని తెలిపారు. గ్రామాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరించి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామీణ జీవనోపాధి మెరుగుదల, విపత్తుల నిర్వహణకు సంబంధించిన పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ చర్యలతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బగ్గు గోవింద్, రాజేంద్ర, సోంబాబు, ఏపీఓ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ఎం. లక్ష్మి, ఉపాధి హామీ వేతనదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## రావిపాడు పాఠశాలను ఎంఈవో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల హోంవర్క్‌లను పరిశీలించిన మాధవరావు
- నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన



**జలుమూరు, జులై 2(వార్త):** రావిపాడు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు గురువారం ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ప్రార్థనా సమయానికే పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి చదువుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల హోంవర్క్ నోట్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా హోంవర్క్ ఇవ్వడంతో పాటు వాటిని ఉపాధ్యాయులు తప్పనిసరిగా తనిఖీ చేయాలని సూచించారు. నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత శ్రద్ధతో బోధన చేపట్టాలని, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువులో పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. పాఠశాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు పేర్కొన్నారు.

## నూతన విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ

- విద్యార్థులను ప్రోత్సహించిన హెచ్ఎం కోటిబాబు
- ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల ఆదరణ పెరుగుతోందని వ్యాఖ్య



**జలుమూరు, జులై 2(వార్త):** పాగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం పాఠశాల ప్రార్థనా సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కోటిబాబు నూతన విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలో 17 మంది విద్యార్థులు కొత్తగా చేరారని తెలిపారు. నూతనంగా చేరిన విద్యార్థుల్లో చదువుపై మరింత ఉత్సాహం పెంపొందించేందుకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాల పేరు ప్రతిష్ఠలు మరింత పెంచాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరవంజ మోడల్ పాఠశాలలో

# ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక

- 23 మంది విద్యార్థులకు అవకాశం
- ఏపీ 14వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ

**జలుమూరు, జులై 2(వార్త):** కరవంజ మోడల్ పాఠశాలలో ఎన్‌సీసీ శిక్షణ కోసం విద్యార్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఏపీ 14వ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి పరంజిత్ సింగ్ ఆధ్వర్యంలో జూనియర్ విభాగానికి సంబంధించిన ఎంపిక కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆసక్తి తదితర అంశాలను పరిశీలించి మొత్తం 23 మంది విద్యార్థులను ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి భావన, సేవా దృక్పథం పెంపొందుతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఎన్‌సీసీ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వీబీజీ-రామ్‌జీ పథకానికి శ్రీకారం

**శ్రీకాకుళం**

## మురుగు కాలువగా మారిన సాగునీటి కాలువ

- వ్యర్థాలు, మురుగునీటితో దయనీయ

- బొరిగివలస, జగన్నాథపురం రైతుల ఆందోళన



**నరసన్నపేట, జులై 2(వార్త):** దేశవానిపేట వద్ద ఎన్‌బీసీ (బీదీజ) ప్రధాన కాలువ నుంచి సాగునీటిని అందించేందుకు నిర్మించిన పిల్ల కాలువ ప్రస్తుతం మురుగు కాలువను తలపించేలా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాలువ నిర్వహణను నిర్లక్ష్యం చేయడంతో వ్యర్థాలు, మురుగునీటితో కాలువ దయనీయ స్థితికి చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం బొరిగివలస, జగన్నాథపురం తదితర ప్రాంతాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ కాలువను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు సమీప నివాసాల నుంచి వచ్చే మురుగునీటిని కూడా కాలువలోకి మళ్లిస్తుండటంతో నీటి నాణ్యత పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. సాగునీటి కాలువ మురుగునీటి కాలువగా మారిపోవడంతో వ్యవసాయ అవసరాలకు నీటిని వినియోగించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువను వెంటనే శుభ్రపరచడంతో పాటు మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించి, సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగితే సాగునీటి వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గ్రామీణ ఉపాధికి కొత్త ఊతం

- కుసుమ పోలవలసలో పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

- వలసల నివారణ, ఏడాది పొడవునా

### ఉపాధి కల్పనే లక్ష్యమని వెల్లడి



**పోలాకి, జులై 2(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించి వలసలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న వీబీజీ-రామ్‌జీ పథకాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గురువారం పోలాకి మండలం కుసుమ పోలవలస గ్రామంలో ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పనులకు శ్రీకారం చుట్టి ఉపాధి హామీ వేతనదారులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. గతంలో ఉన్న పరిమిత పని దినాలతో పోలిస్తే, ఈ పథకం ద్వారా ఏడాది పొడవునా ఎక్కువ రోజులు ఉపాధి కల్పించే అవకాశం ఏర్పడిందని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీల రోజువారీ వేతనాలను ప్రభుత్వం పెంచిందని, ఆ మొత్తాన్ని నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో సరైన ఉపాధి లేక ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వలస వెళ్లే కుటుంబాల సంఖ్యను తగ్గించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే వివరించారు. స్థానికంగానే నిరంతర ఉపాధి అవకాశాలు లభిస్తే గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు వలసలు కూడా గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ప్రతి ఉపాధి హామీ వేతనదారుడు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా ఉపాధి కల్పనతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. చెరువుల పునరుద్ధరణ, కాలువల పూడికతీత, గ్రామీణ రహదారుల నిర్మాణం, భూగర్భ జలాల పెంపు వంటి అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గ్రామాల రూపురేఖలు మారడంతో పాటు కూలీలకు ఆర్థిక భరోసా కూడా లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, రాష్ట్ర పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి సూరపు నారాయణదాసు, మెండ శ్రీను, తర్ర లక్ష్మీనారాయణ, చిట్టి సింహాచలం, గొర్ల ఎర్రయ్య, లుకలాపు చిన్నబాబు, భైరి అచ్చెన్నాయుడు, ఎంపీడీఓ, ఉపాధి హామీ పథకం అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ వేతనదారులు పాల్గొన్నారు.



## బోరు ఆక్రమణపై స్థానికుల ఆందోళన

- దేశవానిపేటలో గోడలు నిర్మించి స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు

- చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన అధికారులు

**నరసన్నపేట, జులై 2(వార్త):** దేశవానిపేటలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన పంచాయతీ బోరు ఆక్రమణకు గురైందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. సుమారు 25 సంవత్సరాల క్రితం పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ బోరు ప్రస్తుతం వ్యక్తిగత ఆక్రమణలోకి వెళ్లిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ బోరు ద్వారా ఎన్నో సంవత్సరాలుగా స్థానికులు నీటిని వినియోగించుకుంటున్నారు. అయితే ఇటీవల ఓ వ్యక్తి బోరు చుట్టూ గోడలు నిర్మించి తన ఆధీనంలోకి తీసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలకు బోరు వినియోగంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఘటనపై విచారణ నిర్వహించి వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, ఆక్రమణలు నిజమైతే వెంటనే తొలగించి బోరును తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి

- దరివాడ పంచాయతీలో కాంగ్రెస్ నాయకుల గ్రామ పర్యటన

- ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మామిడి



**నరసన్నపేట, జులై 2(వార్త):** దరివాడ పంచాయతీ ఊడిగలపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పర్యటన నిర్వహించి స్థానికులతో సమావేశమయ్యారు. గ్రామంలోని వివిధ సమస్యలను తెలుసుకుని ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో మాజీ సర్పంచ్ పైడి విఠల్‌రావు కృషి చేశారని పేర్కొన్నారు. అయితే గ్రామంలో చదువుకున్న యువత అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 భృతి అందించడం లేదని, ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీల అమలును ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సర్వే ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని తమ ఓటు నమోదులో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని కోరారు. గ్రామస్తులు కూడా స్థానిక సమస్యలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలపై తమ అభిప్రాయాలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను పార్టీ తరఫున సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సారవకోట చైతన్యకుమార్, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఏపీ ఈఏపీసెట్‌లో

## పవన్‌సాయికి 10వ ర్యాంకు

- జేఈఈ అడ్వాన్స్‌లోనూ ఓబీసీ విభాగంలో 118వ ర్యాంకుతో ప్రతిభ

- విద్యార్థిని అభినందించిన విద్యావేత్తలు, స్థానికులు



**నరసన్నపేట, జులై 2(వార్త):** పోలాకి మండలం దీర్ఘాసి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తండ్యాల జనార్ధనరావు కుమారుడు పవన్ సాయి ఆంధ్రప్రదేశ్ ఈఏపీసెట్--2026లో రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటాడు. అతని విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పవన్ సాయి గతంలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో కూడా ఓబీసీ విభాగంలో 118వ ర్యాంకు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. వరుసగా జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధించడం విశేషమని విద్యావేత్తలు పేర్కొన్నారు. పవన్ సాయి తల్లి పద్మావతి పోలాకి మండలం రాళ్లపాడు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కుటుంబం నరసన్నపేటలో నివాసం ఉంటోంది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి పవన్ సాయిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదలతో చదివితే ఉన్నత విజయాలు సాధించవచ్చని పవన్ సాయి నిరూపించాడని ప్రశంసించారు.



## ఈఏపీ సెట్‌లో రోహిత్‌కు 110వ ర్యాంక్


- జేఈఈ అడ్వాన్స్‌లోనూ ప్రతిభ

- కంప్యూటర్ సైన్స్‌లో ఉన్నత విద్యే లక్ష్యమంటున్న విద్యార్థి

**నరసన్నపేట, జులై 2(వార్త):** నరసన్నపేటలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన విద్యార్థి అల్లు రోహిత్ ఏపీ ఈఏపీ సెట్-2026లో రాష్ట్ర స్థాయిలో 110వ ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచాడు. ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో కూడా ఉత్తమ ప్రదర్శన కనబరిచి తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. విద్యాభ్యాసంలో క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఈ విజయాన్ని సాధించినట్లు రోహిత్ తెలిపాడు.

భవిష్యత్తులో కంప్యూటర్ సైన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించి సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. రోహిత్ తండ్రి అల్లు షణ్ముఖరావు ప్రైవేట్ బీఈడీ కళాశాలలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి లలితాంబ గృహిణిగా ఉన్నారు. కుమారుడు సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అల్లు రోహిత్ సాధించిన విజయాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు అభినందిస్తూ అతను భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు రోహిత్ విజయం ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

## లయన్స్ క్లబ్ పలాస అధ్యక్షుడిగా నంబాళ్ల



**పలాస, జులై 2 (వార్త):** పలాస లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నంబళ్ల కోదండరామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లైన్స్ క్లబ్ పలాస అధ్యక్షుడుగా నంబాళ్ళ కోదండరామయ్యను గురువారం పలాస లైన్స్ క్లబ్ కార్యాలయంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నంబాళ్ళ కోదండ రామయ్య మాట్లాడుతూ పలాస లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం ప్రజల అవసరాల మేరకు సేవలు అందించడమేనని, ముఖ్యంగా ఆరోగ్య సేవలు, కంటి చికిత్సలు, పేద ప్రజలకు సహాయం చేయడమాని తెలిపారు. లైన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు లభించడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. సమాజంలో ఉన్న ప్రజలకు సేవ చేసే భాగ్యం పలాస లైన్స్ క్లబ్ ద్వారా చేపడుతున్నామని తెలిపారు. లైన్స్ క్లబ్ సభ్యులు సూచనల మేరకు సీనియర్ సభ్యుల సలహాలు తీసుకొని ప్రజలకు సేవ చేస్తామని అన్నారు. క్లబ్ ద్వారా ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు కంటి వెలుగు అందించడం కూడా సేవా లక్ష్యంగా భావిస్తానని చెప్పారు. అధ్యక్షుడుగా ఎన్నికైన నంబాళ్ళ కోదండ రామయ్యకి జిల్లా బాడ్మింటన్ సెక్రెటరీ మూల మల్లిఖార్జునరావు, రిటరీ నగర్ సభ్యులు మల్ల లక్ష్మినారాయణ, పాల్గుణరావు, నరేష్, గురునాధరావు, సుదీర్ పలువురు అభినందనలు తెలియజేశారు.

### బుచ్చిపేటలో అక్రమ ఇసుక నిల్వలపై

## చర్యలు తీసుకోవాలి

- కూటమి పెద్దల అండతో అక్రమ రవాణా జరుగుతోందని సీపీఐ ఆరోపణ

- రోడ్లపై ఇసుక నిల్వలతో ప్రజలకు ఇబ్బందులు

**నరసన్నపేట, జులై 2(వార్త):** బుచ్చిపేట గ్రామంలో అక్రమంగా ఇసుక నిల్వలు చేసి రవాణా కొనసాగిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలతో కొంతమంది ఇసుకను అక్రమంగా నిల్వ చేసి తరలిస్తున్నారని విమర్శించారు. గ్రామంలోని రహదారులపై ఇసుకను నిల్వ చేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై ఇసుక కుప్పలు ఉండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలకు కూడా అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక నిల్వలు, రవాణాపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని, పర్యవేక్షణలో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనంగా ఉండడం వల్ల ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోందని అన్నారు. బుచ్చిపేటలో జరుగుతున్న అక్రమ ఇసుక నిల్వలు, రవాణాపై జిల్లా యంత్రాంగం వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కె. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారులను ఆక్రమించిన ఇసుక నిల్వలను వెంటనే తొలగించాలని కోరారు.



## మందస కానిస్టేబుల్ దివాకర్ ఆకస్మిక మృతి

- మందసలో విషాదచాయలు

- సంతాపం తెలిపిన పలువురు నాయకులు




**మందస, జులై 2(వార్త):** మందస పట్టణంలో బోయివీధికి చెందిన కానిస్టేబుల్ దాసరి దివాకర్(48) అనారోగ్యంతో మరణించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన దివాకర్ విజయవాడలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. దివాకర్ తండ్రి దాసరి ఖగేశ్వరరావు మేజరు పంచాయతీ మందస సర్పంచ్ గా పని చేశారు. దివాకర్ కుటుంబానికి మందసలో మంచి పేరుంది. ఆయన సోదరుడు ఈశ్వరరావు(శివ) రైల్వేలో పని చేస్తున్నారు. దివాకర్ చిన్నప్పటి నుంచి ఎంతో చలాకీగా ఉండేవారు. ఆటల్లో రాణిస్తూ ఏపీఎస్పీలో కానిస్టేబుల్ గా ఎంపికయ్యారు. అప్పటి నుంచి నేటి వరకు కానిస్టేబుల్ గా పని చేస్తున్న దివాకర్ ప్రస్తుతం విజయవాడలో పని చేస్తున్నారు. దివాకర్ భార్య ధనలక్ష్మి సాధారణ గృహిణి. కుమార్తె దేవి గ్రూప్ కోచింగ్ చేస్తుండగా. కుమారుడు గుణశేఖర్ బీటెక్ చదువుతున్నాడు. రాజకీయాల్లో దాసరి కుటుంబానికి మంచి ప్రాధాన్యత ఉండగా.. ఒకప్పుడు మందసలో దాసరి ఖగేశ్వరరావు రాజకీయ దిగ్గజంగా చెప్పుకునేవారు. అందరితో కలివిడిగా ఉండే దివాకర్ మరణంతో మందసలో విషాదచాయలు అలముకున్నారు. దివాకర్ మరణించడంతో ఆయన స్నేహితులు, అభిమానులు, క్లాస్ మేట్స్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. దివాకర్ మృతదేహాన్ని విజయవాడ నుంచి ఆయన సోదరుడు శివ తీసుకువస్తున్నారు. మందసలో శుక్రవారం దివాకర్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- ఎంఈవోకు వినతిపత్రం అందజేసిన యూటీఎఫ్ నాయకులు

- ఎస్ఆర్ అప్‌డేషన్, సెలవుల నమోదు సహా పలు డిమాండ్లు

**నరసన్నపేట, జులై 2(వార్త):** నరసన్నపేట మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) శాంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ (ఎస్ఆర్) అప్‌డేషన్ ప్రక్రియను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే వేసవి సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంబంధించిన సంపాదిత సెలవులను సకాలంలో నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలకు అవసరమైన పుస్తకాల కిట్లను వెంటనే సరఫరా చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నక్క అప్పయ్య, జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com cell. 9963063761, 9160000247, RNI/APTEL/2023/87546